# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vnteluguudaily@gmail.com



సంపుటి : 3 | సంచిక : 57 | సోమవారం 27 జనవరి 2025 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# వ్యవసాయం వెన్నెముకగా..

**జయ జయహే తెలంగాణ గీతం**

**దావోస్ ఒప్పందాలతో రాష్ట్రం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది**

- పరేడ్ గ్రౌండ్స్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- జూబ్లీహిల్స్ నివాసంలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం రేవంత్ రెడ్డి
- సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించింది
- సర్వే ఆధారంగా కొత్త విధానాలను ప్రభుత్వం రూపొందిస్తుంది
- తెలంగాణ యువత ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం బాటలు వేస్తోంది
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

"ప్రజా ప్రభుత్వం తెలంగాణ సంస్కృతికి పెద్దపీట వేస్తుంది. అందెశ్రీ రాసిన జయజయహే గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించాం. వ్యవసాయం రాష్ట్ర ఆర్థికరంగానికి వెన్నెముక. 25 లక్షల మందికి పైగా రైతుల రుణాలు మాఫీ చేశాం. ప్రజాప్రభుత్వం కర్షకులకు రైతు భరోసా అందిస్తోంది. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వనున్నాం."

– జిష్ణుదేవ్ వర్మ, గవర్నర్


3





## హైదరాబాద్‌లో హెల్త్ హబ్

- అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు
- శంషాబాద్ పరిసరాల్లో హెల్త్‌టూరిజం హబ్
- విదేశీ రోగులకు అనుగుణంగా ఏర్పాటు
- స్థలాలకోసం అధికారులు కసరత్తు

# త్వరలోనే సన్నబియ్యం

- కాంగ్రెస్ మాట ఇస్తే.. ఎప్పటికీ వెనక్కి తగ్గదు
- ఏళ్ల తరబడి ఎన్నో పథకాలను అన్నదాతల కోసం కాంగ్రెస్ అమలు చేసింది
- భూమికి, విత్తనానికి ఎలాంటి అనుబంధం ఉంటుందో.. అదే స్థాయిలో రైతుకు కాంగ్రెస్ పార్టీకి అంతంటి అనుబంధం ఉంది
- ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు .. రైతు భరోసా, రేషన్ కార్డులు మార్చ్ 31 దాకా రాష్ట్రంలోని ప్రతీ లబ్ధిదారుడికి అందజేస్తాం
- పేదలంతా ఎక్కడున్నా రేషన్ కార్డు తీసుకోండి
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



**నారాయణపేట జిల్లా:**


తెలంగాణ రాష్ట్రంలో నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ మేరకు నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి నాలుగు పథకాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన రూ.11.80 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. 734 మందికి రైతు భరోసా చెక్కులను రేవంత్ పంపిణీ చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏళ్ల తరబడి ఎన్నో పథకాలను అన్నదాతల కోసం కాంగ్రెస్ అమలు చేసిందని అన్నారు. భూమికి, విత్తనానికి ఎలాంటి అనుబంధం ఉంటుందో.. అదే స్థాయిలో రైతుకు కాంగ్రెస్ పార్టీకి అంతంటి అనుబంధం ఉందని తెలిపారు. నేడు నాలుగు సంక్షేమ పథకాలను రాష్ట్రానికి కొడంగల్ నుంచి అంకితం చేస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు .. రైతు భరోసా, రేషన్ కార్డులు మార్చ్ 31 దాకా రాష్ట్రంలోని ప్రతీ లబ్ధిదారుడికి అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం - మిగతా3లో

## ఘనంగా గణతంత్ర వేడుకలు

**జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి**

**బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీబ్యారెల్ రాకెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.**

**సైనిక అమరవీరులకు మోదీ నివాళి**





## 100వ ప్రయోగానికి ఇస్రో సిద్ధం!

- ప్రయోగ వేదికపైకి జీఎస్ఎల్‌వీ 15ఎఫ్ రాకెట్!
- జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను నింగిలోకి పంపనున్నది
- ఈ రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని భారత్ స్పేస్‌లోకి పంపనున్నది
- ప్రయోగం సందర్భంగా కౌంట్‌డౌన్‌లో మూడురోజుల కంటే తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉందని ఇస్రో పేర్కొంది.

## కేసీఆర్ పేరు తీయకుండా ఒక్క ఉపన్యాసం అన్న ఇచ్చావా

- సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు సెటైర్లు
- గజ్వేల్ రూపు రేఖలు మారినాయని.. ఎన్నిరోజులైనా గజ్వేల్ చరిత్రలో మీ పేరు నిలిచిపోతుంది
- కాంగ్రెస్ ఏడాది పాలనలో ఒక్క పనైనా జరిగిందా
- కాంగ్రెస్ వచ్చింది.. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి బంద్ అయిపోయింది



**గజ్వేల్**

కేసీఆర్ పేరు తీయకుండా ఒక్క ఉపన్యాసం అన్న ఇచ్చినవా అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. దావోస్ పోతే కూడా కేసీఆర్ యాది కోస్తున్నాడు నీకు అని అన్నారు. ఎంత సేపు ప్రతిపక్షాలను తిట్టుడు.. కేసీఆర్ ను తిట్టుడు తప్పా చేసిందేమి లేదంటే అది మీకు పరిపాలన చేతగాని తనానికి పరాకాష్ట అని విమర్శించారు. అప్పుడేమో దేవుళ్ల మీద ఒట్టు పెట్టి ముక్కోటి దేవుళ్లను మోసం చేసిండని.. ఈ రోజేమో గణతంత్ర దినోత్సవం సాక్షిగా అందరికీ ఇస్తానని చెప్పి మళ్ళీ కొందరికే అని అంబేద్కర్‌ను - మిగతా3లో

# ఘనంగా గణతంత్ర వేడుకలు

గణతంత్ర వేడుకల సందర్భంగా దిల్లీలోని కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. సైనిక బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్రివిధ దళాలు సంయుక్తంగా ఒక శకటాన్ని తీసుకురావడం ఈసారి ప్రత్యేకత. వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర మంత్రులు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్ ఇతివృత్తంతో ఈసారి కవాతులో పాల్గొనే శకటాలకు రూపకల్పన చేశారు. బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీబ్యారెల్ రాకెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్తవ్య పథ్‌పై హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. రాష్ట్రపతి భవన్ నుంచి ఎర్రకోట వరకు 9 కిలోమీటర్ల మేర రిపబ్లిక్ డే పరేడ్ ఏర్పాటు చేశారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర శాఖలకు చెందిన 31 శకటాలను ప్రదర్శించారు.

**సైనిక అమరవీరులకు మోదీ నివాళి**

76వ రిపబ్లిక్ వేడుకలను పురస్కరించుకొని దిల్లీలో ప్రధాని నరేద్రమోదీ సైనిక అమరవీరులకు నివాళి అర్పించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధదళాల అధిపతులతో కలిసి ఇండియా గేట్ సమీపంలోని జాతీయ యుద్ధస్మారకం వద్దకు చేరుకున్న ప్రధాని మోదీకి రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్వాగతం పలికారు. అమరవీరుల స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించిన ప్రధాని మోదీ ఆ తర్వాత సైనికవందనం స్వీకరించారు. అమరులకు రెండునిమిషాలు మౌనం పాటించారు. సందర్శకుల పుస్తకంలో సంతకం చేసిన అనంతరం ప్రధాని మోదీ కర్తవ్యపథ్‌కు చేరుకున్నారు.



**మహానుభావులకు శిరస్సు వంచి ప్రణామం**

అంతకుముందు దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు మోదీ. మన ప్రయాణం ప్రజాస్వామ్య పద్ధతిలో, గౌరవంగా, ఐక్యంగా సాగేలా రాజ్యాంగాన్ని రచించిన మహానుభావులకు శిరస్సు వంచి ప్రణామం చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ ఆశయాల పరిరక్షణకు, బలమైన, సుసంపన్న భారతావనిని నిర్మించే దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ఈ వేడుక బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# 100వ ప్రయోగానికి ఇస్రో సిద్ధం!

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో మైలు రాయికి చేరుకునేందుకు సిద్ధమైంది. జనవరి 29న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి వందో ప్రయోగం చేపట్టనున్నది. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను నింగిలోకి పంపనున్నది. ఈ రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని భారత్ స్పేస్‌లోకి పంపనున్నది. అయితే, జీఎస్ఎల్వీ-15 రాకెట్‌తో ఎన్‌వీఎస్ ఉపగ్రహం అనుసంధాన ప్రక్రియ పూర్తయ్యిందని ఇస్రో ఆదివారం పేర్కొంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొంది. ప్రయోగం సందర్భంగా కౌంట్‌డౌన్‌లో మూడురోజుల కంటే తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉందని ఇస్రో పేర్కొంది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని భూస్థిర లక్ష్యలో ప్రేవశపెడుతుందని పేర్కొంది. షార్‌లోని రెండో లాంచ్‌ప్యాడ్ నుంచి ప్రయోగం చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ ఉపగ్రహం సెకండ్ జెనరేషన్ శాటిలైట్ కాగా.. ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని 29 మే 2023న ఇస్రో నింగిలోకి పంపింది. ఇది ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ఎన్‌వీఎస్ సిరీస్‌లో రెండో ఉపగ్రహం. ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్‌లలో నావిగేషన్ పేలోడ్లను.. అలాగే తొలితరం ఉపగ్రహం ఎన్‌వీఎస్-01లో ఉన్నట్లుగానే సీబ్యాండ్‌లో రేజింగ్ పేలోడ్స్ ఉంటాయి. నావిక్ అనేది భారతదేశ స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ.

భారత భూభాగం నుంచి దాదాపు 1500 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న ప్రాంతాల్లో వినియోగదారులకు ఖచ్చితమైన స్థానం, వేగం, సమయం సేవలను అందించడం దీని ఉద్దేశం. కొత్త శాటిలైట్‌తో దేశీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్ మరింత విస్తృతం కానున్నది. ఈ ఉపగ్రహాన్ని బెంగళూరులోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్‌లో రూపొందించగా.. ఇతర శాటిలైట్ సెంటర్లు సహకారం అందించాయి. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ జీఎస్ఎల్వీ సిరీస్‌లో 17వది కావడం విశేషం. దేశీయ క్రయోజెనిక్ స్టేజ్ కలిగిన 11వ రాకెట్. ఈ ప్రయోగం ద్వారా ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ఇస్రో ప్రవేశపెడుతుంది.



# రిపబ్లిక్‌డే పరేడ్‌లో 'ఉమెన్' పవర్

**చరిత్రలో తొలిసారి 100మంది అలా- 148మంది ఇలా!**

**గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన కవాతులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నారీశక్తి**

**15మంది మహిళా పైలట్ల బృందం ఫ్లై-పాస్ట్**

**అధునాతన రక్షణ సాంకేతికతల ద్వారా దేశ భద్రతను బలోపేతం చేయడంలో అతివలు అందించిన కీలకమైన సహకారాన్ని అందులో ప్రదర్శించారు**



దిల్లీలోని కర్తవ్యపథ్‌లో గణతంత్ర దినోత్సవ కవాతు ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో వికసిత్ భారత్, నారీ శక్తి అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దేశ చరిత్రలో తొలిసారిగా 100మంది మహిళలు శంఖం, నాదస్వరం వంటి సంప్రదాయ సంగీత వాయిద్యాలను వాయిస్తూ కర్తవ్యపథ్‌లో పరేడ్‌ను ప్రారంభించారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లో నారీ శక్తికి ప్రాతినిధ్యం వహిస్తూ మహిళా అధికారులు లెఫ్టినెంట్ కర్నల్ రవీందర్‌జీత్ రంధావా, లెఫ్టినెంట్ కమాండర్ మణి అగర్వాల్, ఫ్లైట్ లెఫ్టినెంట్ రుచి సాహా, కెప్టెన్ సంధ్యా మహ్లో దీనిలో పాల్గొన్నారు.

15మంది మహిళా పైలట్ల బృందం ఫ్లై-పాస్ట్

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్-%ణ=ణూ% నిర్వహించిన కవాతుకు మహిళా శాస్త్రవేత్త సునీతా జెనా నాయకత్వం వహించారు. అధునాతన రక్షణ సాంకేతికతల ద్వారా దేశ భద్రతను బలోపేతం చేయడంలో అతివలు అందించిన కీలకమైన సహకారాన్ని అందులో ప్రదర్శించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఐశ్వర్య జాయ్ నేతృత్వంలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన 148 మంది సభ్యుల మహిళా బృందం, డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆదిత్య నేతృత్వంలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ బృందం పరేడ్‌లో పాల్గొన్నాయి. సుమారు 15మంది మహిళా పైలట్ల బృందం ఫ్లై-పాస్ట్‌లో తమ ప్రతిభను చూపారు.

కవాతులో 16 రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన శకటాలు సందడి చేశాయి. వీటిలో మహిళా సాధికారత అంశాన్ని ప్రతిబింబించేవి 26 ఉన్నాయి. మణిపుర్‌లో తామర పూల కాడలలోని సున్నితమైన నారలతో చీరలు తయారు చేసే మహిళలు, పడవలు నడుపుతున్న స్త్రీలు, హస్తకళలు, చేనేత సహా వివిధ రంగాల్లో ప్రఖ్యాతి పొందిన వారికి సంబంధించిన విషయాలను ప్రదర్శించారు.

ఇండోనేసియాకు చెందిన నేషనల్ ఆర్మ్డు ఫోర్సెస్ నుంచి 152 మంది బృందం కవాతులో పాల్గొంది. మరో 190 మంది సభ్యుల బ్యాండ్ బృందం మార్చ్ నిర్వహించింది. లెఫ్టినెంట్ అహాన్ కుమార్ నేతృత్వంలోని 61 మంది అశ్విక దళం కవాతు నిర్వహించింది. అనంతరం ట్యాంక్ %u%-90 (భీష్మ), %దీపూ%-2 శరత్‌తో పాటు నాగ్, బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థలు, పినాక, అగ్నిబాణ్ మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు, ఆకాశ్ వెపన్ సిస్టమ్, చేతక్, బజరంగ్, ఐరావత్‌తో సహా పలు ఆయుధాలను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో త్రివిధ దళాలు సంయుక్తంగా ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'సశక్త్ ఔర్ సురక్షిత్ భారత్' అనే థీమ్‌తో దీన్ని తయారు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఐదు వేల మంది కళాకారులు 'జయతి జయ మహాభారతం' పాటకు 11 నిమిషాల పాటు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. మోటారు సైకిళ్లపై డేర్‌డెవిల్స్ చేసిన విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. బుల్లెట్ సెల్యూట్, ట్యాంక్ టాప్, డబుల్ జిమ్మీ, డెవిల్స్ డౌన్ వంటి అంశాలను ప్రదర్శించారు. 22 ఫైటర్ జెట్‌లు , 11 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఏడు హెలికాప్టర్‌లు వైమానిక ప్రదర్శన వీక్షకులను కట్టిపడేసింది. వీటిలో రఫేల్, సు-30, జాగ్వార్, సి-130,సి-295, సి-17, డోర్నియర్-228, ఏఎన్-31 విమానాలతో పాటు ఎమ్‌ఐ-17 హెలికాప్టర్లు ఉన్నాయి.

## 500 మంది ధనవంతులకు.. పది లక్షల కోట్ల రుణాలను బీజేపీ మాఫీ చేసింది: అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బీజేపీపై మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ ఐదేళ్లలో సుమారు 400 నుంచి 500 మంది ధనవంతులైన స్నేహితులకు పది లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఏ మోడల్‌ను ఎంచుకుంటారో అన్నది ఢిల్లీ ప్రజలు నిర్ణయించుకోవాలని కోరారు. 'ఢిల్లీ ప్రజలకు రెండు నమూనాలు ఉన్నాయి. మొదటిది కేజ్రీవాల్ మోడల్. ఇక్కడ ప్రజల డబ్బును ప్రజల కోసం ఖర్చు చేస్తారు. రెండవది బీజేపీ మోడల్. ఇక్కడ ప్రజల డబ్బు ధనవంతులైన వారి స్నేహితుల జేబుల్లోకి వెళుంది. ఇప్పుడు ప్రజలు ఏ నమూనాను ఎంచుకోవాలో నిర్ణయించుకోవాలి' అని అన్నారు. కాగా, ఆప్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఢిల్లీ ప్రజలు నెలకు రూ.25,000 వరకు ప్రయోజనాలను పొందుతున్నారని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. అయితే బీజేపీ అధికారంలోకి వస్తే వారి నమూనాకు విరుద్ధం కాబట్టి అన్ని సంక్షేమ పథకాలను నిలిపివేస్తారని అన్నారు. మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.




## దేశ స్వాతంత్ర్యం కోసం బీజేపీ చేసిందేమీ లేదు

**బీజేపీ అన్ని రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కింది**

**ఇండియాకు స్వాంతంత్ర్యం తెచ్చిందీ, దేశ ఐక్యత కోసం పోరాటం సాగించిందీ కాంగ్రెస్ పార్టీయే**

**కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే**



**బెంగళూరు:** దేశ స్వాతంత్ర్యం కోసం కానీ, ఆర్థిక, సామాజిక వృద్ధి కోసం కానీ బీజేపీ చేసిందేమీ లేదని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బీజేపీ అన్ని రాజ్యాంగ విలువలను తుంగలోకి తొక్కిందని విమర్శించారు. రిపబ్లిక్ డే సందర్భంగా కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కార్యాలయంలో త్రివర్ణ పతాకావిష్కరణ అనంతరం కాంగ్రెస్ కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి ఖర్గే మాట్లాడుతూ, ఇండియాకు స్వాంతంత్ర్యం తెచ్చిందీ, దేశ ఐక్యత కోసం పోరాటం సాగించిందీ కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. "ఇటీవల పలువురు నేతలు ముఖ్యంగా కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా రాజ్యాంగాన్ని అవమానించిన తీరు బాధాకరం. భారత రాజ్యాంగ నిర్మాతపై దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. అప్పుడు నేను పార్లమెంటులోనే ఉన్నాను. మీరు అంబేద్కర్ నామజపం చేస్తున్నారు..భగవంతుడి జపం చేస్తే స్వర్గంలో చోటైనా దక్కుతుందని అమిత్‌షా మాట్లాడారు. వీళ్లు దేశ స్వాంతత్రానికి గానీ, ఆర్థిక, సామాజిక వృద్ధి కోసం చేసిందేమీ లేదు" అని ఖర్గే అన్నారు. రిపబ్లిక్ డే ప్రాధాన్యతను ఖర్గే వివరిస్తూ, రాజ్యంగానికి దేశప్రజలంతా కట్టుబడి ఉంటాలని, కానీ కొన్ని కారణాల వల్ల రాజ్యాంగ విలువలన్నింటినీ బీజేపీ సారథ్యంలోని కేంద్రం తుంగలోకి తొక్కిందని అన్నారు. పౌరుల హక్కులు, ముఖ్యంగా మహిళలకు రాజ్యాంగ ప్రసాదించిన స్వేచ్ఛను దిగజార్చారని విమర్శించారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను మారుస్తామని ప్రధాని మోదీ చెబుతున్నప్పటికీ 5వ స్థానం నుంచి కదలడం లేదని అన్నారు. యూపీఏ హయాంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశాన్ని ఐదో స్థానానికి నెట్టేశారని విమర్శించారు. బడా వ్యాపారులు, శక్తివంతులకు గరిష్ట ప్రయోజనాలు చేకూరుస్తూ పేదలను పట్టించుకోవడం లేదని అన్నారు. "జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్" నినాదాన్ని కార్యకర్తలందరూ అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు

## సైఫ్ అలీ ఖాన్ కేసులో బిగ్ ట్విస్ట్

**నిందితుడి వేలిముద్రలు మిస్ మ్యాచ్ ఇంతకీ అసలు నేరస్థుడు ఏమైనట్లు**

**సైఫ్ అలీ ఖాన్ కేసులో కీలక మలుపు**

**నిందితుని వేలిముద్రలు మిస్ మ్యాచ్!**



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో ఊహించని ట్విస్ట్ బయటపడినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న బాంద్రా పోలీసులు సైఫ్‌పై దాడికి పాలపడిన నిందితుడు షరీఫుల్ ఇస్లాం వేలిముద్రలను సేకరించారు. అయితే దాడి జరిగిన ప్రదేశంలో లభించిన ఫింగర్ ప్రింట్స్ – నిందితుడితో సరిపోలడం లేదని పోలీసులు గుర్తించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ముంబయిలో ఈనెల 16వ తేదీ తెల్లవారుజామున బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ నివాసంలోకి చొరబడిన దుండగుడు, ఆయనపై దాడిచేసిన కేసు అనేక మలుపులు తిరుగుతోంది. విచారణలో భాగంగా నటుడి ఇంటిని పరిశీలించిన మహారాష్ట్ర సీఐడీ విభాగంలోని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ బృందం అక్కడ ఉన్న దాదాపు 19 వేలిముద్రలను సేకరించింది. వాటిల్లో ఏవీ నిందితుడి ఫింగర్ ప్రింట్స్‌తో మ్యాచ్ కావడం లేదని పోలీసులకు ఫోరెన్సిక్ బృందం వెల్లడించినట్లు తెలుస్తోంది. తదుపరి పరీక్షల కోసం మరోసారి ఘటనా స్థలం నుంచి మరిన్ని వేలిముద్రల నమూనాల్ని సేకరించాలని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు కేసు విచారణ కోసం ముంబయి పోలీసులు సైఫ్ రక్త నమూనాలను, దాడి జరిగిన రోజు ఆయన ధరించిన దుస్తులను సేకరించారు. వీటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఈ కేసులో నిందితుడైన షరీఫుల్ ఇస్లాం దొంగతనం చేయాలనే ఉద్దేశంతోనే ఆ ఇంట్లోకి ప్రవేశించాడని, అయితే తరువాత పరిస్థితి తీవ్ర ఘర్షణకు దారితీసిందని ప్రాథమిక విచారణలో తేలింది. అందుకే దాడి సమయంలో సైఫ్ ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి దుస్తులపై రక్తపు మరకలు కనిపించడం వల్ల అవి సైఫ్ అలీఖాన్‌వేనా, కాదా అని నిర్ధరించడం కోసం నమూనాలు సేకరించారు. దుండగుడి దుస్తులను, సైఫ్ రక్తనమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు అధికారులు తెలిపారు. నిందితుడి దాడిలో సైఫ్ అలీఖాన్ వెన్నెముక, చెయ్యి సహా పలుచోట్ల గాయాలయ్యాయి. ఐదు రోజులపాటు ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయనకు కత్తి గాట్లు పడిన చోట శస్త్రచికిత్స కూడా చేశారు. ఒకటి రెండుచోట్ల ప్లాస్టిక్ సర్జరీ సైతం నిర్వహించారు. ఈనెల 21న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సైఫ్ అలీఖాన్ ప్రస్తుతం కోలుకుంటున్నారు.

## త్వరగా రా.. మూడ్‌లో ఉన్నా


**మహిళకు ఉబర్ డ్రైవర్ మెసేజ్.. తర్వాత ఏం జరిగిందంటే..**

ఆమె ఢిల్లీలోని ఐపీఆర్ లాయర్.. పేరు తాన్యా శర్మ.. ఆమె ఉబర్ ద్వారా ఆటోను బుక్ చేసింది.. అయితే అప్పటికే ఆమెకు ఆటో డ్రైవర్ నుంచి అసభ్యకర మెసేజ్ వచ్చింది.. దీంతో ఆమె ఆ డ్రైవర్ గురించి ఉబర్ సంస్థకు ఫిర్యాదు చేసింది.. అయితే ఆ సంస్థ సరైన రీతిలో స్పందించలేదు.. చివరకు తాన్యా శర్మ పోరాటం కారణంగా ఉబర్ దిగి వచ్చింది.. ఆ ఆటో డ్రైవర్‌ను తొలగించింది.. ఆ ఘటన గురించి తాన్యా శర్మ లింక్డిన్‌లో పోస్ట్ చేసింది. ఆ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ ఘటనపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు తాన్యా శర్మ అనే మహిళా లాయర్ ఉబర్ యాప్‌లో ఆటో బుక్ చేసుకుంది. వెంటనే డ్రైవర్ నుంచి ఆమెకు మెసేజ్ వచ్చింది. –జల్దీ ఆవో బాబు యర్ర్. మన్ హెూ రహా హై– (త్వరగా రా. నేను మూడ్‌లో ఉన్నా) అంటూ డ్రైవర్ ఆమెకు అసభ్యంగా మెసేజ్ పెట్టాడు. దీంతో ఒక్కసారిగా షాక్ తిన్న తాన్య వెంటనే ఆ రైడ్‌ను క్యాన్సిల్ చేసుకుంది. ఉబర్ యాప్‌లో కంప్లైంట్ కూడా పెట్టింది. దానికి స్పందనగా ఘటనపై 48 గంటల్లో విచారణ జరిపిస్తామని మెసేజ్ పంపింది. ఉబర్ ఇండియా స్పందించిన తీరుపై తాన్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఒకవేళ ఈ 48 గంటల్లో ఇంకొంతమంది మహిళలకు ఇలాంటి అనుభవం ఎదురైతే ఎవరు బాధ్యత వహిస్తారు?%--% అంటూ ఉబర్‌ను సూటిగా ప్రశ్నించింది. తాన్య పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉబర్ సంస్థ దిగొచ్చింది. వెంటనే స్పందించి ఆ డ్రైవర్‌ను శాశ్వతంగా బ్లాక్ చేసింది. నెటిజన్లు, శ్రేయోభిలాషుల మద్దతుతోనే ఇది సాధ్యమైందని తాన్యా శర్మ కృతజ్ఞతలు తెలిపింది. ఇలాంటి ఘటనలను తేలిగ్గా తీసుకోవద్దని, వెంటనే రిపోర్ట్ చేయాలని, అందరూ అప్రమత్తంగా ఉండాలని తాన్య సూచించింది.

# వ్యవసాయం వెన్నెముకగా

సాంస్కృతిక వారసత్వంతో, ప్రజా స్వామ్య ఆచారాలతో తెలంగాణ ముందుకు వెళ్తుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, తక్షణ అవసరాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 76వ గణతంత్ర వేడుకల్లో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగించిన గవర్నర్ ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలిపారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచిందన్నారు.

సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించిందని, సర్వే ఆధారంగా కొత్త విధానాలను ప్రభుత్వం రూపొందిస్తుందని స్పష్టం చేశారు. ఇవాళ నాలుగు పథకాలను ప్రారంభం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రజలకు అందిస్తోందన్నారు. తెలంగాణ అభివృద్ధి దిశగా అడుగులు వేసే రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం అని గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ హామీ ఇచ్చారు.





తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజా కవి అందె శ్రీ రాసిన ప్రసిద్ధ గీతం జయ జయహే తెలంగాణ జనని జయ కేతనం రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించబడిందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో ప్రజా ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్?లో జరిగిన గణతంత్ర దినోత్సవాలలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకగా ఉందని, ఈ ప్రభుత్వ హయాంలో గత ఏడాది వర్షాకాలంలో రికార్డు స్థాయిలో 1.59 కోట్ల టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి కలిగిన రాష్ట్రంగా ఆవిర్భవించడంలో తెలంగాణ గొప్ప ఘనతను సాధించింది అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. ఆర్థిక భారాలను తగ్గించడానికి 27 రోజుల్లోనే 2 లక్షల రూపాయల పంట రుణ మాఫీని అమలు చేసిందని స్పష్టంచేశారు. పంట రుణ మాఫీ ప్రయోజనం 25 లక్షల 35 వేల 934 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందన్నారు. రైతు భరోసాతో ఏటా ఎకరానికి రూ.12,000 పెంచిన ఆర్థిక సహాయం రైతులకు పెట్టుబడి పెట్టడానికి భరోసా ఇస్తుందన్నారు.

**యువతక ఉజ్వల భవిష్యత్తుకు**

తెలంగాణ యువత ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం బాటలు వేస్తోందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని స్థాపించడం ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రపంచ స్థాయి శిక్షణను అందించడం సాధ్యమవుతుందన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యే వారిని ప్రోత్సహించడానికి రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ సంవత్సరం బీసీల సంక్షేమం కోసం రూ. 9200 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు.

ఉచిత విద్యుత్ సరఫరా

సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళలు, లింగమార్పిడిదారులకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, తెలంగాణ అంతర్జాతీయ పాఠశాల ఏర్పాటు మొదలైన ఆరు పరివర్తన హామీలను అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

సంక్షేమం, ఆహార భద్రత, గృహనిర్మాణం వంటి బహుళ రంగాలకు ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. నిరాశ్రయులైన, అర్హత కలిగిన కుటుంబాలు ఇళ్ళు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. 2024-2025లో రూ.22,500 కోట్ల బడ్జెట్‌తో 4,50,000 ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేయాలని, రేషన్ కార్డులపై సన్నబియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

**మౌలిక సదుపాయాల అభివృద్ధి**

తెలంగాణ వృద్ధికి మౌలిక సదుపాయాల అభివృద్ధి ఇప్పటికీ కీలకమైనదని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ స్థిరమైన పట్టణ రవాణాను నిర్ధారిస్తుందన్నారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా నిలుస్తుందన్నారు. ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వేలు, ప్రాంతీయ రింగ్ రోడ్డు నిర్మాణం కనెక్టివిటీ రాష్ట్రాన్ని మరో స్థాయికి తీసుకెళతాయన్నారు.

దావోస్ శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందాలు లక్షా డెబ్బయి ఎనిమిది వేల తొమ్మిది వందల యాభై కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులను తీసుకువచ్చాయన్నారు. ఐటీ, పునరుత్పాదక ఇంధనం, ఔషధాలు, స్థిరమైన అభివృద్ధికి కేంద్రంగా తెలంగాణ ఖ్యాతిని పటిష్టం చేశాయన్నారు. ఈ ప్రయత్నాలు 49,500 ఉద్యోగాలను సృష్టించి తెలంగాణ పారిశ్రామిక వృద్ధిని ముందుకు తీసుకెళతాయని ఆకాంక్షించారు. వ్యాపారం, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించడం ద్వారా, రాష్ట్రం పారిశ్రామిక నైపుణ్యంలో అగ్రగామిగా మారడంతో పాటు, ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తూనే ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఐటీ, ఫార్మా పరిశ్రమలలో జీసీసీఎస్ కేంద్రంగా మారిందన్నారు. తెలంగాణ భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన దార్శనికతను కూడా ప్రారంభిస్తోందన్నారు.


**క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ**

తెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025ను రూపొందించిందన్నారు. ఇది రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన, నమ్మకమైన, సరసమైన విద్యుత్తును అందించడానికి ప్రయత్నిస్తూనే రాష్ట్రానికి ఇంధన భద్రతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందులో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కూడా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. ఇది తెలంగాణను సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. నాల్గవ నగరంలో విశాలమైన 200 ఎకరాల్లో ప్రతిష్టాత్మకమైన ఏఐ నగరాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

# త్వరలోనే సన్నబియ్యం

-మొదటిపేజీ తరువాయి

చంద్రవంచలో ఇవాళ(ఆదివారం) 4 పథకాలను సీఎం రేవంత్ ప్రారంభించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. లబ్ధిదారులకు చెక్కులను సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా చెక్కులను, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఇక్కడి నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ఈ పథకాలను చంద్రవంచ నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి 2023 దాకా కొడంగల్‌కు జరగాల్సిన స్థాయిలో న్యాయం జరగలేదన్నారు. ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో తాను సీఎం అయ్యానని.. తాను ఇప్పుడు సమయం కేటాయించ లేకపోయినా.. కొడంగల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



**రుణమాఫీ చేశాం..**

దేశమంతటా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని చెప్పారు. ప్రధాని మన్మోహన్‌సింగ్ ఒక్క సంతకంతో దేశమంతా రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. రైతులకు ఒకే విడతలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. సాగు ఖర్చులు పెరిగాయని రైతు భరోసా నిధులు పెంచామన్నారు. ఏడాదికి ఎకరాకు రూ.12వేలు చొప్పున రైతు భరోసా ఇస్తున్నామని తెలిపారు. ఇవాళ ఆదివారం కాబట్టి రైతుభరోసా డబ్బులు జమకావు అని చెప్పారు. అర్ధరాత్రి 12 దాటగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భూమిలేని వారిని కూడా ఆదుకోవాలని గతంలో కూలీలు అడిగారని గుర్తుచేశారు.

**గత ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వలేదు**

భూమిలేని పేదలను ఆదుకునేందుకు రైతుభరోసా తీసుకువచ్చామన్నారు. కూలీ పనిచేసే పేదలకు రైతుభరోసా కింద రూ.12 వేలు ఇస్తున్నామని అన్నారు. గత పదేళ్లలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు రాలేదని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో గ్రామాల్లో ఎవరికైనా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. పేదలు ఇల్లు నిర్మించకుంటే రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వలేదని మండిపడ్డారు. రేషన్‌కార్డు ఉన్న పేదలకు త్వరలోనే సన్న బియ్యం ఇస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సభల ద్వారా రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. గ్రామ సభల ద్వారా గ్రామాలకు అధికారులను పంపిస్తున్నామన్నారు. గతంలో ఏదైనా కావాలంటే ఎవరైనా ఫాంహౌస్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ప్రజల దగ్గరకే ఎమ్మెల్యేలు, అధికారులు వస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ప్రజల సమక్షంలోనే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని అన్నారు. ప్రభుత్వమే ప్రజల దగ్గరకు వచ్చి దరఖాస్తులు తీసుకుంటోందని చెప్పారు.

**నిరంతరం కృషి చేస్తాం..**

"ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి నిరంతరం కృషి. రాష్ట్రాన్ని చుట్టుముట్టిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. ఇచ్చిన గ్యారంటీలను అమలుచేస్తూ ముందుకు వెళ్తున్నాం. ఎంతోమంది పేదలు కొత్త రేషన్‌కార్డులు కోసం ఎదురుచూపులు. రైతు కూలీలు ప్రభుత్వ అండ కోరుకుంటున్నారు. రైతు భరోసాతో ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం. పదేళ్ల తర్వాత ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వానిది విడదీయరాని అనుబంధం. రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని మొదలుపెట్టింది కాంగ్రెస్సే. 2024 ఆగస్టు 15న రూ.21వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశాం. 25.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.21వేల కోట్లు జమ. ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే 55,147 ఉద్యోగాలు ఇచ్చాం" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**కాళేశ్వరం మూడేళ్లకే కూలింది..**

"ప్రజా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే.. ఎప్పటికీ వెనక్కి తగ్గదు. తెలంగాణ ఇస్తామని సోనియా గాంధీ చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి.. పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేయలేదు. రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలింది. కాళేశ్వరం కూలిపోయినా.. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రతిపక్ష నేత సభకు రాని దుస్థితిని ఏమనాలి. ప్రతిపక్ష నేతగా బాధ్యత నిర్వర్తించినప్పుడు ఆ పదవి ఎందుకు. మనం ఎన్నుకున్న సర్పంచ్ గ్రామంలో లేకుంటే ఎలా ఉంటుంది. ప్రాజెక్టుల కోసం భూ సేకరణ చేస్తే ప్రజలను రెచ్చగొడుతున్నారు. మన ప్రజలకు ఉపాధి కోసం పరిశ్రమలు తేవాలని భావించా. మాయమాటలు చెప్పి ప్రజలను రెచ్చగొట్టి పరిశ్రమలు అడ్డుకున్నారు. నా సోదరుడు ప్రజా సేవ చేస్తుంటే.. ఏం పదవి ఉందని అంటున్నారు. కేసీఆర్ కుటుంబం వల్లే మా ఇంట్లో అందరూ పదవులు పొందలేదు. సోదరులు, బంధువులు అందరికీ పదవులు ఇస్తేనే.. మంచిదా? కుటుంబం అంతటికీ పదవులు ఇచ్చి దోపిడీ చేసే వ్యక్తిని కాదు. కేసీఆర్ తన కుటుంబానికి, బంధువులకు పదవులు ఇచ్చారు. కేసీఆర్ కుమార్తె ఎన్నికల్లో ఓడిపోతే వెంటనే ఎమ్మెల్సీ చేశారు. పేదలంతా ఎక్కడ ఉన్నా.. రేషన్‌కార్డు తీసుకోవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## కేసీఆర్ పేరు తీయకుండా ఒక్క ఉపన్యాసం అన్న ఇచ్చావా..



-మొదటిపేజీ తరువాయి

కూడా మోసం చేశాడని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. ఆదివారం జరిగిన గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం అభినందన సభలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గజ్వేల్ చరిత్రలో చరిత్రలో ఈ ఐదేళ్లు స్వర్ణయుగం అనే చెప్పాలని అన్నారు. నా భూతో న భవిష్యత్ ఇంత గొప్ప అవకాశం ఏ సర్పంచ్‌కు, వార్డు మెంబర్లకు, ఏ కౌన్సిలర్‌కు.. ఎవరికీ దొరకని అదృష్టం మీకు దొరికిందని గజ్వేల్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ఐదేళ్లలో గజ్వేల్ దశ దిశ మారిందని హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్ రూపు రేఖలు మారినాయని.. ఎన్నిరోజులైనా గజ్వేల్ చరిత్రలో మీ పేరు నిలిచిపోతుందని చెప్పారు. ఈ ఐదేళ్లలో సాగునీరే కాదు తాగు నీరు కూడా వచ్చిందని.. గజ్వేల్‌కు రింగ్ రోడ్డు, హైదరాబాద్ తర్వాత ఆరు లైన్ల రింగ్ రోడ్డు రావడం చిన్న విషయం కాదని తెలిపారు. ఒకనాడు ఇడుపు కాగితాలను వేదికైన పాండవుల చెరువు.. ఈ రోజు పిల్లా పాపలతో కలకళలాడుతుందని హరీశ్‌రావు తెలిపారు. ఒక అద్భుతమైన టూరిజం కేంద్రంగా అభివృద్ధి చెందిందని అన్నారు. గజ్వేల్‌కు జిల్లా ఆసుపత్రి వచ్చింది.. రైలు వచ్చింది.. విద్య.. వైద్యం.. మౌళిక సదుపాయాలకు అన్నిటికీ కేంద్రంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ రకంగా గజ్వేల్ దశ దిశ మార్చిన కేసీఆర్ నాయకత్వంలో కౌన్సిలర్లుగా పనిచేయడం ఇది మీ అందరి అదృష్టమని వ్యాఖ్యానించారు. ఎంత పని చేసినా ఇంకా కొంత పని మిగిలే ఉంటుందని.. ప్రజలకు కొరత ఉంటుందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ఏడాది పాలనలో ఒక్క పనైనా జరిగిందా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ వచ్చింది.. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి బంద్ అయిపోయిందని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలిపారు. మొదలు ప్రజాపాలన దరఖాస్తు అన్నరని.. మొన్ననేమో కులగణన పేరు మీద సర్వే అని దరఖాస్తులు పెట్టించిండని.. ఇప్పుడేమో గ్రామసభల పేరు మీద మల్ల దరఖాస్తులు అంటుండు.. అప్లై.. అప్లై.. నో రిప్లై.. అన్నట్లు అయిపోయిందని ఎద్దేవా చేశారు. ఇయ్యాల రేవంత్ రెడ్డి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుండని హరీశ్‌రావు మండిపడ్డారు. ఆనాడు ఏ దరఖాస్తు లేకుండా కేసీఆర్ సంక్షేమ పథకాలు ఇయ్యలేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ 11 విడతల్లో 73 వేల కోట్ల రూపాయలు రైతు బంధు ఇచ్చిండని తెలిపారు. 13 లక్షల మందికి లక్ష రూపాయల చొప్పున తిప్పలు పడకుండ కళ్యాణ లక్ష్మి ఇచ్చినామని.. ఏ దరఖాస్తు లేకుండా 57 ఏళ్లకే ఆసరా పెన్షన్ ఇచ్చారని చెప్పారు. ఏ పథకాన్ని అయినా దరఖాస్తు లేకుండా కేసీఆర్ అందరికీ అందించారని పేర్కొన్నారు. దరఖాస్తుల పేరు మీద పెదల ఉసురు తీసుకుంటున్నవు తప్పా.. చేసిందేం లేదని మండిపడ్డారు.

## హైదరాబాద్‌లో హెల్త్ హబ్



నగరంలో వైద్యం కోసం ఇతర దేశాల నుంచి వచ్చే సంఖ్యా ఏటా పెరుగుతోంది. కారణం అత్యాధునిక వైద్య సదుపాయాలు తక్కువ ఖర్చుతో అవుతుండడమే.

హైదరాబాద్?లో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇతర దేశాలతో పోల్చితే ఇక్కడ చికిత్సలు తక్కువ ఖర్చుతో అవుతాయి. దీంతో ఇక్కడ వైద్యం చేయించుకునేందుకు విదేశీయుల భారీగా వస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో హెల్త్? టూరిజం హబ్? ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అంతర్జాతీయ వైద్య ప్రమాణాలు పర్యాటక ప్రాంతాల విశిష్టతలు ఒకే చోట ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఫోర్త్? సిటీ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో వైద్యం, పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తోంది

రంగారెడ్డి జిల్లా రెవెన్యూ పరిధిలో ఐటీ, పరిశ్రమలతో పాటు వైద్యారోగ్యశాఖల అధికారులు హెల్త్?టూరిజం హబ్?ను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి 20 కిలోమీటర్ల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలను సేకరిస్తున్నారు.

ఒకేచోట 200 నుంచి 1000 ఎకరాల భూములుంటే బాగుంటుందన్న ఆలోచనతో అధికారులు ఎక్కువ స్థలాలున్న ప్రాంతాలపై దృష్టి సారిస్తున్నారు.

విశాలమైన రహదారులు, మౌలిక సదుపాయాలు సులభంగా కల్పించడం, రవాణా సౌకర్యాలు, 24 సాఫీగా రాకపోకలు కొనసాగించేందుకు అనువుగా హెల్త్?టూరిజం హబ్?ను ఏర్పాటు చేయనున్నారు.

అధికారులు రూపొందించిన నివేదికలను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించాక హెల్త్?టూరిజం హబ్? విధివిధానాలు ఖరారయ్యే అవకాశముంది.

**పర్యాటక ఆకర్షణలు :**

ఇప్పటికే కొత్వాల్?గూడలో ఎకో పార్కు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా శంషాబాద్-తుక్కుగూడ-పెద్ద అంబర్?పేట-ఓఆర్ఆర్ మార్గానికి సమాంతరంగా అటవీశాఖ మూడు పార్కులను అభివృద్ధి చేసింది. వీటికి అదనంగా ఉదయం నుంచి రాత్రి వరకూ కార్యకలాపాలు కొనసాగించే ఫన్‌జోన్, రెస్టారెంట్లను ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

శంషాబాద్ విమానాశ్రయ పరిసరాల్లో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో కలిసి ఉద్యానాలు, గేమింగ్ జోన్ల ఏర్పాటుకు అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలన్న యోచనలో ఉన్నారు.

ఆసుపత్రులు, పర్యాటక ప్రాంతాలు పక్కపక్కనే ఉంటే విదేశీ రోగులు, వారితో వచ్చే కుటుంబ సభ్యులతోపాటు శివారు ప్రాంతాల్లో ఉంటున్నవారికి ఆహ్లాదకరంగా ఉంటుందని యోచిస్తున్నారు.

ప్రధానంగా వారికోసమే : హెల్త్‌టూరిజం హబ్‌లో ఆసుపత్రులు నిర్మించేందుకు ఆసక్తి ప్రదర్శించే ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనుంది. వీటిని ప్రధానంగా విదేశాల నుంచి వచ్చే రోగుల కోసం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తెలిపింది. హైదరాబాద్‌లోని ప్రముఖ కార్పొరేటు ఆసుపత్రుల్లో ఇప్పటికే ఆఫ్రికా, మధ్యప్రాచ్యదేశాల నుంచి రోగులు వస్తున్నారు. అందుకు ఈ దేశాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల నుంచి హెల్త్‌టూరిజం పేరుతో వచ్చే రోగులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. వీటికి అదనంగా ఎయిమ్స్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణాన్ని కూడా చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



వాస్తవ నేస్తం, భీంపూర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఆదివారం 76 వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగాయి. మండలం కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో నలంద ప్రియ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ గోపాల కృష్ణ రెడ్డి, పోలీస్ స్టేషన్'లో ఎస్సై మొహమ్మద్ కలిం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నిఖిల్ రాజ్, బీఆర్ఎస్ కార్యాలయంలో మేకల నాగయ్య, బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు అంకం అశోక్ అలాగే 26 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, తాజా మాజీ సర్పంచ్ మడవి లింబాజీ, డిటీ హరిధాస్, ఎంపిఓ సుమీర్ ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

## చందు నాయక్ తాండలో ఘనంగా గణతంత్ర దినోత్సవం



వాస్తవ నేస్తం,బజార్హత్నూర్: మండలంలోని చందు నాయక్ తాండ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పతాకావిష్కరణ తర్వాత విద్యార్థుల తోటి సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాల చైర్మన్, పంచాయతీ కార్యదర్శి భీమ్ సింగ్, కారోబారి సంతోష్, గ్రామ పెద్దలు, పోషకులు హాజరయ్యారు. అనంతరం వివిధ ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మోతి సింగ్ బహుమతులను ప్రధానం చేశారు.

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలంలో గణతంత్ర వేడుకలు

**విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాధవ్**



**వాస్తవ నేస్తం బోథ్:** 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ నాయకులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థినిలతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1950 జనవరి 26న దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భంగా గణతంత్ర దినోత్సవం జరుపుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, గార్లతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కొలువు కోసం డీప్

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల భర్తీ వేగం పుంజుకుంది. తాము ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఏడాదిలో 55 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్య పరిష్కారాన్ని వేగవంతం చేయాలని రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రైవేటు కొలువులపై దృష్టిపెట్టారు. ప్రభుత్వం మధ్యవర్తిత్వంలో ప్రైవేటు సంస్థల్లోనూ అర్హులకు ఉద్యోగాలు ఇచ్చేలా డీఈఈటీ(డీట్) యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ యాప్ ఏఐ ఆధారంగా పనిచేస్తుంది. పరిశ్రమలకు, నిరుద్యోగులకు వారధిగా పనిచేస్తుంది. నిరుద్యోగులకు ఉన్న నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు ఈ డిజిటల్ ప్లాట్‌పాం కల్పిస్తుంది. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చడమే లక్ష్యంగా దీనిని ప్రభుత్వం రూపొందించింది. దీంతో రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ప్రైవేటు సంస్థలో నిరంతరం ఉద్యోగాల కల్పనకు ఈ డీట్ యాప్ పనిచేస్తుందిఈ యాప్‌లో ఉద్యోగ సమచారంతోపాటు స్కిల్ ప్రోగ్రామ్‌లతోపాటు అన్నీ ఒకేచోట లభించేలా డిజిటల్ ప్లాట్‌ఫాం అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేక యాప్‌ను రూపొందించిన ప్రభుత్వం వివిధ కంపెనీలు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను అలాగే అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్ తదితర వివరాలను ఈ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అందుబాటులోకి తెస్తుంది. వివిధ అవసరాలకు తగినట్లుగా కంపెనీలు రిక్రూట్‌మెంట్ చేసుకుంటాయి.నిరుద్యోగులతోపాటు ఫైనల్ ఇయర్‌లో ఉన్న విద్యార్థులు తమ పూర్తి వివరాలను ఇందులో నమోదు చేసుకోవడం ద్వారా సులభంగా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుంది. వివరాలు నమోదుచేసుకున్న అభ్యర్థులకు కంపెనీలు తమ అవరసాలకు తగిన ఉపాధి అవకాశాలకు సంబంధించిన మెస్సేజ్‌లు, మెయిల్స్ పంపించడంతోపాటు కాల్స్ కూడా చేసి ఇంటర్వ్యూలునిర్వహిస్తాయి. ఈ యాప్ ద్వారా ఉద్యోగాలు కోరుకునేవారికి మాత్రమే కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. మెరుగైన స్కిల్స్ ఉన్నవారిని ఎంపిక చేసుకోవడానికి కంపెనీలకు వెసులుబాటు కలిగింది.డీట్ యాప్ ప్రస్తుతం ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది డీఈఈటీ పేరిట ఉంటుంది. దీనిని డౌన్‌లోడ్ చేసుకుని ఉద్యోగం కోసం సైన్ఇన్ అవ్వాల్సి ఉంటుంది.

## గోవిందపురం ఎల్ గ్రామంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండలంలోని గోవిందపురం గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం రైతులు సిబ్బంది ప్రజలు జెండా ఎగరవేసిన సొసైటీ సొసైటీ అధ్యక్షుడు మాది నేనేరభద్రరావు, సిపిఎం సీనియర్ నాయకుడు మాదినేని నారాయణ, వేనోదల లక్ష్మణరావు, కళ్యాణ బుచ్చయ్య, కళ్యాణ్బు శ్రీను, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత రాంబాబు వలరాజు వైసీపీ మాజీ అధ్యక్షుడు ఇరుగు జ్ఞానేషు సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంకెనలో ప్రజాపాలన పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం



వాస్తవ నేస్తం,పలిమెల:మండలంలోని పంకెన గ్రామంలో ప్రజా పాలన పథకాలు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పలిమెల మండలంలో ఎనిమిది గ్రామ పంచాయతీలు ఉండగా అందులో పంకెన గ్రామ ప్రజల అదృష్టం మేరకు పంకెన గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నుకోవడం జరిగింది పైలెట్ ప్రాజెక్టు కింద 221 ఇండ్లు మంజూరు చేయడం జరిగినది. పంకెన గ్రామ ప్రజలు చాలా ఆనందంగా మన తెలగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఇండ్లు వచ్చినయని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమన్నారు.

## దళిత ఉద్యమ కెరటం మందా క్రిష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు

**శుభాకాంక్షలు తెలిపిన దళిత జర్నలిస్టుల ఫోరం కమిటీ**



**వాస్తవ నేస్తం,బోనకల్:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ, పద్మభూషణ్,పద్మ విభూషన్ పురస్కారాల్లో గత 40 సంవత్సరాల నుంచి తెలుగు రాష్ట్రాలలో సామాజిక ఉద్యమాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మందా క్రిష్ణ మాదిగకి పద్మశ్రీ ప్రకటించటం పట్ల మండల దళిత జర్నలిస్టుల ఫోరం కమిటీ సభ్యులు దేగల వేలాది,యంగల గౌతం,మందా సత్యనందం లు హర్షం వ్యక్తం చేస్తు మందా క్రిష్ణమాదిగకు ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా దళిత ఉద్యమాల్లో ముందుండి పోరాడుతు,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఏ పదవి ఆశించకుండా దళిత ఉద్యమాల్లో భాగస్వాములయ్యారనీ అన్నారు రిజర్వేషన్లలో మాదిగలకు సరైన వాటా అందాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలనే డిమాండ్‌తో 1994లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్)ను స్థాపించారనీ,నాలుగు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం వందలాది కార్యక్రమాలు,పోరాటాలు చేస్తున్న కృష్ణ మాదిగ సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ ప్రకటించడం గమనార్హం అని అన్నారు.ఎస్సీల వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని ఇటీవలే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మంద కృష్ణ మాదిగ పోరాటం విజయానికి చేరువైందనీ వారు అన్నారు.భవిష్యత్తులో క్రిష్ణ మాదిగ మరిన్ని అవార్డులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటునట్లు వారు తెలిపారు.

# ప్రజాపాలనలో మరో ముందడుగు

లబ్ధిదారులకు మంజూరైన పత్రాల అందజేత

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు నిరంతర ప్రక్రియ.

జిల్లా పాలనాధికారి రాజర్షి షా



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆదివారం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులను ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను జిల్లా పాలనాధికారి రాజర్షి షా అందజేశారు. పేదవారి సొంత ఇంటి కల నెరవేరబోతుందని, అర్హులైన నిరుపేదలకి ఇళ్ళు కట్టుకునేందుకు 5 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. గత పదేండ్లుగా రేషన్ కార్డుల కొరకు ఎదురుచూస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇచ్చేందుకు నిరంతరం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు ఇవ్వడం జరుగుతుందని, ప్రజలు ఎవరికైనా అర్హత లేకుండా పథకాలు పొందితే తెలియజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని ప్రజాపాలన గ్రామ సభలో సంక్షేమ పథకాల జాబితాలో పేరు లేకపోతే ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఆ జాబితా ప్రజాపాలన, కుల గణన, మీ సేవలో దరఖాస్తు చేసుకున్న పేర్లు మాత్రమే చివరి జాబితా కాదు అని రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇంది రమ్మ ఇండ్లు లాంటి పథకాలకి దరఖాస్తు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ఎంపిడిఓ, పంచాయతీ కార్య దర్శులు సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పని చేసేది లేదు.. ఆధిపత్యమే కావాలి..!?

కాంగ్రెస్ %ఎం% బీఆర్ఎస్...!

వాగ్వివాదాలు.. అడ్డుకోవడాలు

సమయపాలన పాటించడం లేదు : కాంగ్రెస్

ప్రోటోకాల్ పాటించడం లేదు : బీఆర్ఎస్

నిరసనల మధ్య కొనసాగిన గ్రామసభలు

నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవంలో అదే తీరు

కుచులాపూర్'లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధం



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య ఆధిపత్య పోటీ జరుగుతూనే ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సమన్వయంతో పని చేసేది పోయి ఆధిపత్యం కోసం ఆరాటం పడుతున్నారని జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంద్రమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభల్లో మొదలుకొని, జనవరి 26 న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సైతం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. జిల్లాలోని పలు మండలాలలో నిర్వహించిన లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యేల ఫోటోలు లేకపోవడంతో ఆగ్రహించిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అధికారులతో వాగ్వివాదానికి సందర్భాలు ఉన్నాయి. బోథ్ నియోజకవర్గంలోని కుచులా పూర్ గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సమయపాటి సమయపాలన పాటించలేదని కాంగ్రెస్ నాయకులు, ఫోటో కాల్ పాటించడం బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటలు యుద్ధం జరగడంతో ఒకే సారీ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బోథ్ నియోజకవర్గంలోని కుచులా పూర్ గ్రామం లో నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభిస్తామని ప్రకటించారు. కానీ స్థానిక ఎమ్మెల్యే రాక కోసం ఎదురుచూస్తున్న అధికారులను బోథ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాకపోతే ఉన్నవారితో కార్యక్రమాన్ని ప్రారంభించాలని అన్నారు. అదేవిధంగా సభ వేదికపై కాంగ్రెస్ నాయకులు ఉండడం, అంతేకాకుండా అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని బీఆర్ఎస్ నాయకులు సభ వేదిక వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా ముందుకు తోసుకు రావడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ ఉన్న పోలీసులు జోక్యం చేసుకొని ఇరు పార్టీల నాయకులను సర్ది చెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇలా కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ నాయకులు ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్నారని బోథ్ నియోజకవర్గంలో చర్చలు జరుగుతున్నాయి.

## అట్టహాసంగా పథకాల ప్రారంభం

**ప్రభుత్వ పతకాలను ప్రారంభించిన నాయకులు అధికారులు**

**వాస్తవ నేస్తం,తలమడుగు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇళ్లు కొత్త రేషన్ కార్డు పథకాలను తలమడుగు మండలం లోని లక్ష్మీపూర్ గ్రామం లో నాయకులు అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం నీకి ముఖ్య అతిథిగా జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రజల క్షేమమే ద్యేయంగ ప్రజల ఆశలకు ఆకాంక్షాలకు అనుగుణంగా ప్రతి పేద వాడికి పథకాలు అందించే విధంగా ప్రభుత్వము ముందుకు వెళ్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మండల ప్రత్యేక అధికారి గజానాన్ ఎమర్వో రాజ్ మోహన్ ఎంపీడీఓ చంద్ర శేకర్, డిప్యుటీ తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీవో వినోద్,మాజీ ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్ నాయకులు అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు

## సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా గనతంత్ర వేడుకలు



వాస్తవ నేస్తం,బోథ్: 76వ గనతంత్ర దినోత్సవ వేడుకలు సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ పట్టణ అధ్యక్షులు నరేష్ ముమ్వన్నెల త్రివర్ణ పతాకం ఎగరవేశారు. రాజ్యాంగ ఫలాలు ప్రతి పౌరుడికి అందాలని ఆకాంక్షించారు. అప్పుడే స్వాతంత్ర సమరయోధులు కలలు కన్నా భారత దేశం నిర్మితమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు గోవర్ధన్, నరేష్, మున్సిఫ్, కృష్ణ, నరేష్, శ్రీనివాస్. కార్తీక్, ప్రేమ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

వాస్తవ నేస్తం



# స్థానిక వార్తలు

## రాజకీయాలకు అతీతంగా పథకాలు అందజేయాలి: ఎమ్మెల్యే అనిల్



**వాస్తవ నేస్తం,బోథ్:** రాష్ట్రంలో నాలుగు కొత్త పథకాల ప్రారంభోత్సవంలో భాగంగా బోథ్ మండలంలోని కుచులపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పథకాల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతు.. పథకాలు వాగ్దానాలకే పరిమితం కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందించాలని ఎమ్మెల్యే అన్నారు. లిస్టులలో పేర్లు రాని వారు ఆందోళన చెందొద్దని అందరం కలిసి పథకాల కోసం ప్రయత్నం చేద్దామని అన్నారు. రాజకీయాలకు పోకుండా ప్రభుత్వం అందరికి లబ్ధిచేకూర్చలన్నారు. కార్యక్రమంలో అధికారులు, బోథ్ మార్కెట్ కమిటీ చెర్మన్ బొడ్డు గంగయ్య, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమోహన్ గార్లతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపిటిసిలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ.. ఆర్థిక సాయం అందజేత




**వాస్తవ నేస్తం,ఇచ్చోడ :** మండలంలోని బోరిగామ గ్రామంలో సొన్న పుష్ప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు, ఉషోదయ అసోసియేషన్, బోరిగామ యూత్ నాయ కులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఉషోదయ అసోసియేషన్ బోరిగామ యూత్ తరపున రూ.10వేలు, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ రూ.5 వేలు చొప్పున బాధిత కుటుం బానికి ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ యూత్ అసోసియేషన్ బోరిగామ ప్రెసి డెంట్ బొల్లి రవి, వైష్ ప్రెసిడెంట్ రమణయ్య, ప్రధాన కార్యదర్శి తాడూరి స్వామి, కోశాధికారి జంగిలి రమణ, మురళి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రశంసా పత్రం అందుకున్న పంచాయతీ కార్యదర్శి ఇమామ్ వలి



**వాస్తవ నేస్తం,బోనకల్:** మధిర మండలం నక్కలగరుబు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇమామ్ వలి జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధినిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సత్కరించింది. 2024లో విధి నిర్వహణలో అంకిత భావంతో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను పంచాయితీ కార్యదర్శి ఇమామ్ వలికి జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రం అందించి అభినందించారు. బోనకల్ మండలం కలకోట గ్రామానికి చెందిన ఇమామ్ వలి జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల ఆయన్ను గ్రామ ప్రజలు, పలువురు అధికారులు అభినందనలు తెలియజేశారు.

## అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు




**వాస్తవ నేస్తం,భీంపూర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు పథకాలను ఆదివారం భీంపూర్ మండలంలోని బెల్సారి రాంపూర్ లో మండల ప్రత్యేక అధికారి కిషన్, తహసిల్దార్ నలందప్రియ, ఎంపీడీవో గడ్డం గోపాలకృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయా పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఈ నాలుగు సంక్షేమ పథకాలను అందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి, వారికి అవసరమైన సంక్షేమ ఫలాలను అందిస్తామన్నారు.. ఉపాధి హామీ 20 రోజుల నిబంధన తీసివేయాలని మండల సీనియర్ నాయకుడు దాసరి రమేష్ అధికారులను కోరారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హన్ను పటేల్, కామన్ వార్ అశోక్,మతిన్ పటేల్,దేవ రెడ్డి, తన్వీర్ పటేల్,పంచాయతీ కార్యదర్శి సాయి, మాజీ సర్పంచ్ రూప శంకర్,అధికారులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



ఇచ్చోడ ప్రెస్ క్లబ్ లో వేడుకలు..



ఇచ్చోడ లో భారత మాత వేషధారణలతో విద్యార్థులు

**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** 76వ గణతంత్ర దినోత్సవ వేడుక లను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ప్రభాత ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థుల నృత్యాలు, సాంసృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఇచ్చోడ ప్రెస్ క్లబ్'లో...

మండల కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్'లో గణతంత్ర దినోత్సవ వేడుకలను పాత్రికేయులు ఘనంగా జరుపుకున్నారు. జాతీయ జెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు నరాల రమణయ్య, దేగల శంకర్, నరాల రాజేశ్వర్, చౌహాన్ విజయకుమార్, అబ్దుల్ ఖదీర్ షేక్ కాజా నైతం పద్మారావు, తుక్క రెడ్డి రాజేందర్ రెడ్డి, వివిధ వర్గాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ లో విద్యార్థుల సాంస్కృతిక విన్యాసాలు

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

## ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్... నవేగావ్'లో నాలుగు ప్రభుత్వ పథకాలు ప్రారంభం



లబ్ధిదారుడికి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

వాస్తవ నేస్తం,ఇచ్చోడ: అర్హులైన లబ్ధిదారులందరికి ప్రభుత్వ పథకాలు అధించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల లక్ష్యమని అదిలాబాద్ జిల్లా ఎంపీ గోడం నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అన్నారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను ఆదివారం మండ లంలోని నవేగావ్ గ్రామంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవ సాయ యోగ్యమైన ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతు భరోసా పంట పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్నదని పేర్కొన్నారు. భూమిలేని నిరుపేదలకూ, ఉపాధి హామీ పథకంలో 20 రోజులపాటు పనిచేసిన వారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాకి రూ.12 వేలు ఇవ్వనున్నదని వారు స్పష్టం చేశారు. అర్హత ఉన్న వారిలో అసలైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తారని, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తారని చెప్పారు. నవేగావ్ గ్రామాన్ని పైలట్ గ్రామం గా ఎంపికయిందని వారు తెలిపారు. అంతరం లబ్ధిదారులకు పథకాలకు సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ గుమ్మడి జితేందర్ రెడ్డి, తాహసిల్దార్ సత్యనారాయణ రావ్, ఎంపీడీవో కొండ లక్ష్మణ్, ఎంపీవో సత్యానంద్, వ్యవసాయ అధికారి జాదవ్ కైలాస్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు తహారీ రమేష్, మాజీ సర్పంచ్ ముండే పాండురంగ్, సీనియర్ నాయకులు మాధవరావు, కదం బాబా రావు, వామన్ గిత్తే, మటకరి రాజేశ్వర్, విష్ణు, పెందుర్ తులసి, పెందుర్ కేశవ్, కుమ్రం కోటేశ్, చౌహాన్ శేషారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీఅర్ఎస్ నాయకుల అహంకరాన్ని బోథ్ నియోజకవర్గంలో నడవనియం: ఆడే గజేందర్

## బీఅర్ఎస్ నాయకులను కార్యక్రమం నుండి వెళ్ళి పోవాలని నిలదీసిన గ్రామస్తులు

## ఆడే గజేందర్ ని ఘనంగా సన్మానించిన కుచులపూర్ గ్రామస్తులు




**వాస్తవ నేస్తం,బోథ్:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాల అమలులో బోథ్ మండల కుచులాపుర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎన్నుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభించాల్సిన కార్యక్రమన్ని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కొరకు గంటల తరబడి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ఆడే గజేందర్ కుచులపూర్ గ్రామానికి చేరుకొని అధికారులను నిలదీశారు. లబ్ధిదారులను ఎంత సేపు కూర్చో పెడ్తారు ఎమ్మెల్యే ఆలస్యానికి లబ్ధిదారులు ఎంత సేపు నిరిక్షించాలని అధికారాలను నిలదీసి పథకాల అమలు కార్యక్రమాన్ని మొదలు పెట్టించారు. కార్యక్రమం ప్రారంభ అనంతరం వచ్చిన ఎమ్మెల్యేను,ఎమ్మెల్యే అనుచరులను గ్రామస్తులు నిలదీశారు, బిఆర్ఎస్ డౌన్ డౌన్ అంటు బీఆర్ఎస్ నాయకులను కార్యక్రమంలో నుంచి వెళ్లిపోవాలని గ్రామస్తులు పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎందుకు డబుల్ బెడ్రూంలు ఎవ్వలేదు అని నిలదీశారు. అనంతరం గ్రామస్తులు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆడే గజేందర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వైస్ చైర్మన్ ఆడే వసంత్ రావు, మార్కెట్ డైరక్టర్ ఇంద్ర సేన రెడ్డి, పాక్స్ డైరెక్టర్స్ గొర్ల రాజు యాదవ్ ,పసుల చంటి,కుర్మే మహేందర్, అరుణ్ రెడ్డి, పాల శంకర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# హైప్ పెంచేస్తున్న సుధీర్ బాబు సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర లుక్

టాలీవుడ్ యాక్టర్ నవ దళపతి సుధీర్ బాబు నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ జటాధర  తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. రిపబ్లిక్ డే సందర్భంగా వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను షేర్ చేశారు. పాపులర్ జీ స్టూడియోస్ ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం కానుంది. యాక్షన్‌తో నిండిన, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో సాగే జటాధార మీ మనసును కదిలించబోతుంది. షూటింగ్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతుంది. అంటూ రిపబ్లిక్ డే సందర్భంగా అప్‌డేట్ అందించారు మేకర్స్. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే నిర్మాణ విలువలతో సినిమా ఉండబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కానుంది. ఈ చిత్రాన్ని శివన్ నారంగ్, ప్రేర్నా అరోరా, నిఖిల్ నందా, ఉజ్వల్ ఆనంద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గతేడాది హరోం హర, మా నాన్న సూపర్ హీరో సినిమాలో ప్రేక్షకుల ముందుకొచ్చాడు సుధీర్ బాబు. ఈ సారి రూటు మార్చి సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌తో రాబోతుండటంతో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిగిపోతుంది.




# 'దళపతి 69' నుంచి విజయ్ సెకండ్ లుక్ రిలీజ్

తమిళ సూపర్ స్టార్ దళపతి విజయ్ మరికొన్ని రోజుల్లో సినిమాలు దూరమవుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్ తమిళ వెట్రి కళగం అనే పార్టీని స్థాపించాడు. ఇక నుంచి తాను పూర్తిగా రాజకీయల్లోనే ఉంటానని.. ఇదే తన చివరి చిత్రం అంటూ దళపతి69 ప్రాజెక్ట్‌ను ప్రారంభించాడు. జన నాయగన్ (ప్రజల నాయకుడు) అనే టైటిల్‌తో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను కార్తీ (ఖాకీ) సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న హెచ్.వినోద్ దర్శకత్వం వహించబోతున్నాడు. రిపబ్లిక్ డే కానుకగా ఈరోజు ఉదయం చిత్రం నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టైటిల్‌ను రివీల్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మూవీ నుంచి విజయ్ సెకండ్ లుక్ పోస్టర్‌ను వదిలారు. కొరడా పట్టుకుని ఉన్న విజయ్ లుక్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ మూవీని నిర్మించనుంది. ప్రేమలు ఫేమ్ మమితా బైజు ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాను అక్టోబర్ 2025న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.




# హిట్-3 లుక్‌తో నాని

గతేడాది సరిపోదా శనివారం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు నాని  ఈ స్టార్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి హిట్ ఫ్రాంఛైజీ హిట్ 3  ఇప్పటికే శైలేష్ కొలను దర్శకత్వంలో వచ్చిన హిట్, హిట్-2 చిత్రాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. ఇక హిట్ 3 కోసం అర్జున్ సర్కార్ డ్యూటీలో చేరిపోయాడు.. అంటూ మేకర్స్ నాని పాత్రపై స్నీక్ పీక్ అందిస్తూ గ్లింప్స్ విడుదల చేశారని తెలిసిందే. మంచు పర్వతాల మధ్య కారుతో దూసుకుపోతున్న హిట్ ఆఫీసర్‌ని ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు ఛేజ్ చేస్తున్న సన్నివేశాలు హైప్ పెంచేస్తున్నాయి. భారతదేశం, భారతీయుల అమర స్ఫూర్తికి వందనం. హిట్ టీం తరపున గణతంత్ర దినోత్సవ శు భాకాంక్షలు. %ఎ×% 3 2025 మే 1న ప్రపంచవ్యాప్తంగా సినిమా థియేటర్లలోకి వస్తోందని తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. నాని గన్ పట్టుకొని సెల్యూట్ చేస్తున్న పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని వాల్‌పోస్టర్ సినిమా, నాని హోం బ్యానర్ యునానిమస్ ప్రొడక్షన్స్ పై ప్రశాంతి త్రిపురనేని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని సిగార్ తాగుతూ, రక్తపు చేతులతో కారు నడుపుతూ, మరోవైపు గొడ్డలితో స్టైలిష్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు నాని. ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# మనదే ఇదంతా.. రవితేజ 'మాస్ జాతర' గ్లింప్స్ రిలీజ్

మాస్ మహరాజా రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' ట్యాగ్‌లైన్. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయికగా కనిపించనున్న ఈ చిత్రం మే 9న థియేటర్‌లలో సందడి చేయనుంది. నేడు రవితేజ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు చిత్రబృందం శుభాకాంక్షలు తెలుపుతూ.. 'మాస్ జాతర' అంటూ గ్లింప్స్ రిలీజ్ చేశారు. టైటిల్‌కు తగినట్లుగానే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంది ఈ గ్లింప్స్. చాలా రోజుల తర్వాత పాత రవితేజ కనిపించబోతున్నాడని.. రవితేజ అభిమానులు కోరుకునే అన్ని అంశాలుంటాయని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.




Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com